

# కథా కౌముది

## పథికుడు - పి.శాంతాదేవి

వంగూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన "మొట్టమొదటి అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల కథల పోటీ" లో బహుమతి పొందిన కథ.

నా ఈ ప్రయాణం ఎక్కడ మొదలు పెట్టానంటే నేను ఏం చెప్పాలి? ఎక్కడ మొదలెట్టాలి? అసలు నేనెవరు? నేనొక నిత్యచైతన్యాన్ని నేనొక అలుపెరుగని వీరుడిని. కష్టజీవిని. కష్టజీవినంటే నాకు డబ్బు లేదనుకునేరు. ఇవాళ నాకు చాలా డబ్బుంది. బాంకుల్లో లక్షలున్నాయి. రెండు ఇళ్ళున్నాయి. పొలాలున్నాయి. కానీ రోజు గడవాలంటే కష్టం చేసి తీరాలి. నాకేమని కూర్చోడానికి లేదు.

ఆ రోజుల్లో, అవిభాజ్య భారత దేశంలో పంజాబ్ రాష్ట్రంలో, అంటే ఈనాటి పాకిస్థాన్‌లో కరాచీకి సుమారు 60కి.మీ దూరంలో ఉన్న ఓ గ్రామంలో పుట్టాను నేను. కలిగిన కుటుంబంలోనే పుట్టాను. మా నాన్నగారు టీచరు. మేము ఆరుగురు పిల్లలం. నేను ఆఖరువాడిని. ముందు ముగ్గురు అక్కలు, తరువాత ఇద్దరు అన్నయ్యలు, ఆ తరువాత నేను.

నేను పుట్టిన రెండేళ్ళకే అమ్మ జబ్బుచేసి చనిపోయింది. నేను ఆవిడకోసం బెంగపెట్టుకుని ఏడిచే వాడినట. మా నాన్నగారు చెపుతుండేవారు. మా పెద్దక్క నాకు తల్లయ్యింది. కానీ, నాకు జ్ఞాపకం ఉన్నప్పటి నుండి నేను కష్టపడుతూనే ఉన్నాను. నా గురించిన నా మొట్టమొదటి జ్ఞాపకం ఆ రోజూ, నేనూ, పెద్దన్నయ్య వంట చెరకు కొడుతున్నాం. నేను కొడవలితో చీలుస్తున్నాను. కొడవలి నా చేతిమీద పడి వేలు తెగింది. నేను ఏడవడం మొదలెట్టాను.

'ఎందుకేడుస్తావు? వేలు నోట్లో పెట్టుకో! సుఖంగా ఉంటుంది' అన్నాడు అన్నయ్య. వేలు నోట్లో పెట్టుకున్నాను. బాధ తగ్గింది. కన్నీళ్ళ మధ్యలోంచి నవ్వాను. అలా కష్టంలోంచి సుఖాన్ని తరచి చూడడం నేర్చుకున్నాను.

మాకు ఆవులూ, ఎద్దులూ ఉండేవి. ఇంట్లో ఒక 10 మంది ఉండేవాళ్ళం. ఇందరికీ త్రాగడానికీ, వాడుకోవడానికి, స్నానాలకీ, పశువులకి త్రాగించడానికీ అన్నిటికీ నీళ్ళుకావాలి. కావిళ్ళు భుజాన వేసుకుని, అన్నయ్యలు, నేనూ కాలవ నుండి నీళ్ళు మోసేవాళ్ళం. నాకు ఏడేళ్ళప్పుడు నుంచి, చిన్న బిందెలతో నీళ్ళు తెచ్చేవాడిని. క్రమంగా బిందెల పరిమాణం పెరిగింది.

ఈ రోజుల్లో కుళాయి త్రిప్పితే నీళ్ళు వస్తుంటే ఆ నీటిని వృధాగా వదిలేసే కుర్రాళ్ళకు, నీటి కోసం జనం పడే కష్టాలు ఎలా తెలుస్తాయి? నేను చూస్తాను, ఎంత మందో, ముందు కుళాయి తిప్పేసి, ఆ నీరు అలా వృధాగా పోతుంటే, చేతులు రుద్దుకుని, అప్పుడు కడుక్కుంటారు. అలా కారిపోయిన ఒక్కొక్క నీటి బొట్టూ, నా ఒక్కొక్క చెమట బొట్టు అనిపిస్తుందినాకు.

ఈ పనులన్నీ చేసి, స్కూలుకి వెళ్ళి చదువుకునేవాళ్ళం. చక్కగా చదువుకునేవాడిని. ఎప్పుడూ ఫస్టు వచ్చేవాడిని. నేను హయ్యర్ సెకండరీలో ఉన్నాను. జీవితం కష్టాలలో సుఖంగా గడిచిపోతుండగా మా అందరి జీవితాన్ని అతలాకుతలం చేస్తూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. స్వాతంత్ర్యం సంతోషాన్నిస్తే దాని వెంట వచ్చిన విభజన తీరని శోకాన్ని మిగిల్చింది. గుండెలు రగిలే ఆవేదన మిగిలింది.

అక్కడున్న ఆస్తులూ, ఇల్లూ అన్నీ వదిలేసుకుని చేతిలో ఉన్న సొమ్ముతో, కొద్దిపాటి బట్టలతో, సామానుతో, అందరం అమృతసర్‌కి రైలెక్కాం. ఎందుకంటే అప్పటికి మా పెద్దక్క పెళ్ళయి అమృతసర్‌లో ఉంది. పెద్దన్నయ్య ఆర్మీలో చేరి, అంబాలాలో ఉన్నాడు. చిన్నక్క పెళ్ళయ్యింది కానీ వాళ్ళు ఇంకా దూరంలో ఉన్నారు.

ఆ రైలు ప్రయాణంలో మేము పడ్డ ఇబ్బందులు నేను వర్ణించి చెప్పలేను. నిలబడటానికి కూడా చోటు లేదు. తిండి లేదు. ఇంకో రకంగా ప్రయాణం చేసే సాధనం లేదు. అలాగే ప్రయాణం చేస్తుంటే, ఆ రైలు ఒక చోట ఆగిపోయింది. ఉద్యమకారులు ఆపేసారు. అక్కడ్నుంచి ఊళ్ళోకి వచ్చి బస్సెక్కుదామని అందరం వెళ్ళాం. బస్సులో అలాగే రద్దీగా ఉన్నాయి. బస్సుల టాపుల మీద కూడా మనుష్యులున్నారు. నాన్నగారు, అక్క, అన్నయ్య ఎక్కారు. నేను ఎక్కబోతున్నాను. ఇంతలో ఎక్కడ్నుంచో ఒక పెద్ద గుంపు కేకలు పెడుతూ అటు వచ్చేసరికి, డ్రైవరు కంగారుగా బస్సు నడిపేసాడు. నేను బయట్నుంచి, నాన్న లోపల్నుంచి అరుస్తూనే వున్నాం. బస్సు ఆపలేదు.

అలా 17 ఏళ్ళ వయసులో, ఒక్కడ్నే చేతిలో డబ్బు లేకుండా, అన్నం పెట్టే నాధుడు లేకుండా ఏడిస్తే అడిగే దిక్కులేకుండా, నడిరోడ్డుమీద నిలబడిపోయాను. నాన్నా వాళ్ళు చేరారో లేదో తెలీదు, తెలుసుకునే మార్గంలేదు. అక్కడ్నుంచి కాళ్ళీడ్చుకుంటూ కాందిశీకుల శిబిరానికి చేరాను.

ఒకళ్ళను చెయ్యిజాపి అడగడం నాకు అవమానం. అక్కడ ఆశిబిరంలో రొట్టెలు అవీ పంచేవారు. అందినప్పుడు తినేవాడిని. అక్కడా, అక్కడా పనులు చేసుకుంటూ, నెమ్మదిగా, ఒకళ్ళిద్దరిని మంచి చేసుకున్నాను. ఒక పెద్దాయన నా మీద దయతలచి, తన ఇంట్లో పనికి పెట్టుకున్నాడు. అక్కడ నాలుగు నెలలుండి, కాస్త డబ్బులు సంపాదించుకుని, పరిస్థితులు కుదట పడ్డాక, ఒకరోజు బయల్దేరి అమృతసర్ చేరుకున్నాను. అక్కవాళ్ళ ఆనందం వర్ణనా తీతం. అక్కనన్ను ఆదరించి, దగ్గరపెట్టుకుని కొన్ని రోజులకి నాన్నగారి దగ్గరకు చేర్చింది. నాన్నగారికి నా తెలివితేటల మీద చాలా నమ్మకం. కాని విధివైపరీత్యానికి భయపడి బెంగపెట్టుకున్నారు. ఆ తరువాత ఉపాధి వెతుక్కుంటూ అందరం ఢిల్లీ చేరాం. అన్నయ్య ఒక్కడి సంపాదన ఏ మూలకి? నేనూ, చిన్నన్నయ్య పనులు వెతుక్కున్నాం. కనిపించిన పనల్లా చేసాను. ఒక కంపెనీలో డెయిలీ లేబరుగా చేరాను. ఇంజనీర్లు పనితీరు, వాటిలోని మర్మాలు గమనిస్తూ ఉండేవాడిని. ప్రైవేటుగా చదువుకుని పాసయ్యాను. ఇంజనీరునయ్యాను. ఇంజనీరుగా ఒకటీ రెండు కంపెనీల్లో పనిచేశాను. తరువాత స్వంత ప్రాక్టీసు పెట్టాను.

ఎన్నో కంపెనీలకి అడ్వయిజర్ని నేనిప్పుడు. జీవితంలో పడ్డ కష్టాలన్నీ నా జీవిత హర్మ్యానికి పునాది రాళ్ళయ్యాయి. నా జీవితంలో నాకు జరిగిన ఒక అతిపెద్ద విషయం, మధురమైన విషయం, నా పెళ్ళి, నేను ఇంజనీరుగా పనిచేస్తున్న కంపెనీలోని ఒక సీనియరు, నా జీవితగాధ విని, నా పట్టుదల, పనితనము చూసి, తన కూతురునిచ్చి వివాహం చేసారు. గౌరి నా జీవిత పథాన్నే మార్చేసింది. ఆమె ఎంతో సుగుణవతి. తనతో సహజీవనం నా బాధలను మరిపింపచేసింది. ముగ్గురు పిల్లలు పుట్టారు. వాళ్ళను చదివించాను. పెద్దవాళ్ళను చేసాను. పెళ్ళిళ్ళు చేసాను.

కాలగమనంలో ఎన్నో మార్పులు వచ్చాయి. నాన్నగారు నా దగ్గరే తుదిశ్వాస విడిచారు. ఆయన పెద్ద వయసులో ఆయనకు నేను, నా భార్య ఎంతో సేవ చేసాము. ఆయన దీవెనలు వలన నేను వృత్తిలో చాలాపైకి వచ్చాను. సంపాదన బాగా పెరిగింది. పెద్ద ఇల్లు కట్టుకున్నాను. నాకూ 65 ఏళ్ళు వచ్చాయి. అన్నీ చక్కగా నడుస్తున్నాయని నేను కాస్త రిలాక్సవ్వబోయాను. ఇంక నా జీవితం ఒడ్డున పడింది, ఒడుదుడుకులు లేవనుకున్నాను. దేవుడు బహుశ: అనుకున్నాడు లావుంది. వీడికెంత పొగరు అని! అంతే మా ఆవిడను తీసికెళ్ళిపోయాడు. చక్కగా ఉన్న మనిషి, ఉన్నట్లుండి కడుపులో నెప్పి అంది. చిన్న ప్రేగుల్లో ఇన్ఫెక్షన్నన్నారు. అది ఎక్కువయిపోయింది. హాస్పిటల్లో పెట్టాం. ఇంతలో కేన్సరన్నారు. సమస్య మొదలయినప్పటినుంచి నెల రోజుల్లో అంతా అయిపోయింది.

మా నాన్న పోవడం కంటే, పార్టిషన్ కంటే అన్నింటికంటే నాకు ఇది చాలా పెద్ద కష్టం. ఏం చెయ్యను? ఎవరితో చెప్పుకోను? ఎలా ఊరట పొందను? మళ్ళీ ఒంటరి ప్రయాణం మొదలెట్టాను.

గౌరి పోయి సంవత్సరం పూర్తయ్యింది. కాని అక్కడితో దేవుడు నన్ను క్షమించలేదు. నా కూతురిని ప్రేమించి పెళ్ళి చేసుకున్న నా అల్లుడు, ఇంకో అమ్మాయి ఆకర్షణలో పడి, నింద దీని నెత్తిని వేసి, విడాకులిచ్చేసాడు. నేను వెళ్ళి ఎంత బ్రతిమాలినా, అతడు మారలేదు. చంద్రుడ్నే చేరిన ఈ మానవుడు, మనుష్యుల గుండెల్నే మార్చిన ఈ మానవుడు మనుష్యుల స్వభావాన్ని మాత్రం మార్చలేకున్నాడు, ఇది వింత కాదూ?

ఇద్దరు పిల్లలతో, నెత్తిమీద నిందతో, దిగజారిన ఆత్మస్థైర్యంతో, నా కూతురు నా ఇంట్లో అడుగు పెట్టింది.

'నాన్నా నా తప్పులేదు' అంటూ నన్ను పట్టుకుని బావురుమంది. నా పిల్లను నేను అక్కున చేర్చు కున్నాను.

'నీ తండ్రి బాగుండగా నీకు కష్టం రానియ్యడమ్మా' అని ఓదార్చి ధైర్యం చెప్పాను. పిల్లలను స్కూళ్ళలో చేర్పించాను. నా కూతురు చదువుకున్నది. దానికి సరిపడిన ఉద్యోగంలో పెట్టాను.

ఈసారి మళ్ళీ రెట్టింపయిన బాధ్యతలతో ప్రయాణం మొదలెట్టాను. భగవంతుడి మీద నమ్మకం పెట్టుకుని, నా మీద ఉన్న బాధ్యతలను నెరవేర్చుకునే ప్రయత్నంలో గమ్యం వెతుక్కుంటూ, తరగని జీవితపు బాటలో, అలుపెరగకుండా ప్రయాణం చేస్తున్న బాటసారిని నేను. నా బాధ్యతలు తీర్చుకుని, నా తండ్రిని కలవడమే నా ఈ ప్రయాణపు గమ్యం.ప్రగతి పధంలో ప్రయాణము చేస్తున్న పధికుడను నేను.

●●●

Click here to share your comments on this story